# హిస్త్రీ—నీకు జోహార్లు

తులసి బాలకృష్ణ



ఓ వెలుగు వెలిగి అస్తమిస్తున్న సంధ్యా సమయపు సూర్యబింబంలా వుంది ఆ వ్యక్తి ముఖారవిందం. చెరగని చిరునవ్వుతో, అరమూసిన కళ్లతో, రెప్పపడుతూండగ ఫోటో తీసి నట్లుంది—

ఏ వూరివాడో
ఏ తల్లి బిడ్డడో
ఏ బిడ్డలకు తండ్రో

ఇక్కడ ఇలా ఎవ్వరూ గుర్తుపట్టలేని వూళ్లో ఎవ్వరికీ చెందని వ్యక్తిలా దిక్కులేని శవమై !! ఇంత అని ఖచ్చితంగా చెప్పలేం కాని, ఏభయి దాటి అరవయ్యో పడిలో పడ్డ వయస్సు విశ్వరహస్యాన్ని అర్థం చేసుకున్నంత తేజస్సు గుబురుగా పెరిగిన నల్లటి గడ్డంలో అందంగా తీర్చిదిద్దినట్లున్న తెల్లటి పాయలు పైకి విసిరేసినట్లు రోడ్డుమీద పరచుకున్న సముద్ర కెరటాల్లాంటి దట్టమైన కురులు పాలభాగాన చెరిగీ చెరగని బొట్టు అందమైన పంచెకట్టు పైన లాల్చీ కొద్ది దూరంలో పడ్డ శాలువా భుజం నుంచి జారి ముంజేతికి చుట్టుకున్న చేతిసంచీ, పాదాలకు అరజారిన ఆకు చెప్పులు, కాళ్లు బురద పట్టి వున్నాయి.

కళ్లప్పగించి, తెరుచుకున్న నోళ్ల మీద వేళ్లేసుకుని, శవం చుట్టూ దూరంగా వలయాకారంలో నిలబడి, వింతగా చూస్తున్నారు జనం అప్పటికే చాలాసేపు చూసిన వాళ్లు, పెద్ద మనుషులు అనిపించుకునే వాళ్లూ కింకర్తవ్యం అనే ఆలోచనలో పడ్డారు

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వాన కురిసి, చెరువులు, వాగులు పొంగి, వూళ్లకు వూళ్లు మునిగిపోతూండటంతో దారులు తెలుసున్న వాళ్లే ఇళ్లు కదలకుండా, ముడుచుకుని, ముసుగుతన్ని పడుకున్నారు ఈ ప్రొద్దున్న కదా తెరిపి ఇచ్చింది అల్లాంటిది—ఈ అభాగ్యుడు పాపం

ఒక్కళ్ళూ తమకు తెల్సంటంలేదు — ''ఎవ్వరికీతెలవని వ్యక్తి ఈవూరెందు కొచ్చుంటాడబ్బా ? !'' తెరిచిన నోరు మూత పడలేదు ఆశ్చర్యంతో ఒక పల్లె యువతికి.

''అందులో రేత్రంతా ఏంవోనా ఏం లోకం ? శుబ్బరంగా నానిపోయాడు. జంఛన్ కాడ బస్సుదిగి, ఈ అయిదు మైళ్ళూ వోన్లో తడుతూ, బురదలో పడుతూ లేతూ, సీకట్లో ఒంటరిగా వచ్చుంటాడు పాపం. పెద్ద పేణం, జీబురుమనే సీకటి, కంకర బెడ్డలెట్టి కొట్టినట్టు వోన, ముళ్ళు, తొడలోతు బురద, ఎన్నడెరగని కొత్తదారి, దార్లో రెండు వాగులు. . పిచ్చిమడిసి పాపం గుండాగి పోదామరి ?'' అన్నాడొక తాత జాలిగా చూస్తూ.

''అస్సరే ఇప్పుడేటి సెయ్యడం — అది సూడండి ముందు'' చిర్రుబుర్రుమందొక కంఠం

''ఏటుందీ — ఈరబద్రుడుగోరికి కబురంపితే సరి.''

''సర్లే. నానేవన్నా పంచాయితీ పెసిడెంట్నా శవాలు తగలెట్టేవోణ్ణా నా కొడుకల్లారా అంటే? పైగా తూర్పు తెల్లారకుండా ఈసావు కబుర్లేంట్రా లమ్డీకొడకల్లారా అంటాడు ''

''ఛఛ అది కాదెస్. అసలు పరిత్తితి ఇదీ అని ఆరికి సెప్పడం ఇదాయకం కదామరి. సెప్పాక ఆరేటి సెయ్యమంటే అది సెయొచ్చు కాన్నువ్వన్నట్టు మహాకోపిట్టి మడిసి తిట్టినా తిడతాడు. అలాగని సెప్పకపోతే వూల్లో ఇంతిసేసం జరిగితే మొదట నాకు సెప్పాలని తెలవందట్రా సవటనాకొడకల్లారా అంటాడు ఏటయితే అవుతుంది పదండి సెబుదారి ''

వీరభద్రుడుగారింటికి కబురు చేరిన విధం బెట్టిదనిన — ముందు పరుగులు తీసింది ... పిమ్మట వేగం తగ్గించి నడిచింది . ఆపైన సంశయించింది . ఆగింది . తెగింపుగా పరుగెత్తింది . భయం భయంగానే చేరింది.

వార్త వింటూనే వీరభద్రుడుగారి భ్రుకుటి ముడివడింది చెయ్యి ఫోనుమీద పడింది. రిసీవరు చెవిని చేరింది — ధ్వనిలేదు.

''చచ్చింది'' స్వగతంగా అన్నట్లుగా అన్నారు గుబురు మీసాల క్రిందుగా గంభీరంగా.

''లైన్లుపాడయిపోయుంటాయండి'' అన్నాడొక యువకుడు గబుక్కున

'మరే' అన్నట్లుగా కనురెప్పలుకొట్టారు వీరభద్రుడుగారు

అందరూ ఆ యువకుడివైపు జానపద హీరోని చూసినంత గొప్పగా చూసారు. వాడి ఛాతీ వుబికింది.

''పట్నం ఫోను కొట్టి పోలీసోళ్లకు చెబుదామనుకున్నాను ఇది కాస్తా చచ్చింది '' అని ఓ క్షణం తల పంకించి, ''మన వూరి మీదుగా చింతకాయల పల్లిగ్గాని వెళ్తున్నాడేమో ? ఆ వూరికి కబురెట్టండి ఎవళ్లైనా గుర్తుపడ్తారేమో చూడండి'' చుట్టు ముట్టించి, పడక్కుర్చీలో వాల్తూ ఆదేశించారు.

''సింతకాయలపల్లిక్కూడా దారి సరిగ్గా లేదండిప్పుడు ''అన్నాడు యువకుడు హుషారుగా

చ(రున వాడివైపు వీరభ(దుడుగారి చూపు పడడంతో ''నువ్వు నోర్ముయ్యరా ఎదవా'' అని వాడ్ని కసిరి, అన్నాడు తాత, ''సిత్తం అయ్యా సింతకాయలపల్లికూడా మునిగిపోయిందనే సెప్పాలండి. అసలీ దచ్చినపు దిక్కున్నప్ప తతిమ్మా మూడు దిక్కులూ దారి లేదండి వాగులు పొంగిపోయి అంతా నీరేనండయ్యా ''

''ఊ'' అన్నారంతే కొడిగట్టిన చుట్టని విదుల్చుతూ ఆయన ముఖంలో బాధగాని, సానుభూతిగాని, ఆందోళనగాని ఏ కోశానా లేవు గంభీరంగా వున్నారు, అలవాటు (ప్రకారం

అయిదు నిముషాలు చీమ చిటుక్కుమంటే వినిపించేంత నిశ్శబ్దం అందరూ నెమ్మదిగా మొహాలు చూసుకున్నారు తాత ధైర్యం చేసి అన్నాడు, ''పోనీ పాపం పెద్ద మడిసి ఊరుగానూరు మనవే దహన సంస్కారం జరిపించేత్తే బాబయ్యా ?''

ఓసారి బెదురుతూన్న తాత కళ్లల్లోకి (ప్రశాంతంగా చూసి, ''చివరకి చేసేదదేలే కాని ఏ కులపోడో తెలియదుకదా చూడండి – మరో రెండు మూడు గంటలు ఎవ్వరూ గుర్తుపట్ట లేకపోతే ఎవడో ఒహడి చేత తీయించేస్తాంగాని, శవాన్ని అలా వుంచంకదా అంతకంటే మనమేం చేస్తాం'' అనేసి, లేచి లోపలకు వెళ్లిపోయారు

అందరూ తెల్లబోయి మొహాలు చూసుకున్నారు ఎవడో ఒకడిచేత తీయించేయడానికి ఈయనగారి అవసరం, పెద్దరికం ఏముందీ ?! అంత కర్కశత్వమా మరీనూ ? చనిపోయిన వ్యక్తి వున్నతవంశానికి చెందినవాడులాగ, ఉత్తమ సంస్కారిలాగ, విద్యాధికుడులాగ కనబడుతున్నాడు కనీసం ఒకటి రెండు రోజుల్దాక శవాన్ని ఏదో విధంగా పట్నం చేర్చడానికయినా వీలుపడదు అక్కడయినా ఎదరొచ్చి గుర్తుపట్టుతారనే నమ్మకముందీ ? పెద్దలు పూనుకుని శాస్త్రోక్తంగా దహనం చేయించడం (ప్రస్తుత కర్తవ్యం నీరుతీసి, ఊరుకి (ప్రపంచంతో సంబంధాలు ఏర్పడ్డాక, పేపరు (ప్రకటనద్వారాను, ఇతర(త్రాను ఆయన బంధువులకి తెలియపరచొచ్చు కానీ ఎవనో ఒహరిచేత ! దారుణం !! నోరు మెదిపే ధైర్యం ఎవరికుందీ ?! తలొంచుకుని లేచారు

శవం చుట్టూ జనం సంఖ్య ఇప్పుడు బాగా పెరిగింది ఊరి అశేషజనం అక్కడే వున్నారు ఓపికగలిగినంతసేపు అదేపనిగా శవాన్ని చూడడం, ఆపైన దూరంగా జరిగి, జాలిపడడం, వేదాంతం చెప్పుకోవడం తప్పించి, దహన సంస్కారం మేం జరిపిస్తామని ఎవ్వరూ ముందుకు రాలేదు కులం తెలియని వ్యక్తి కావడం కొందరికి, తెగించి ముందుకొస్తే వీరభ(దుడుగారికి ఏం కోపం కలిగించినవాళ్ల మవుతామోనని కొందరికి, భవిష్యత్తులో ఏ వివాదాల్లో చిక్కుకోవలసి వస్తుందోనని కొందరికీ అడ్డంకులయ్యాయి

తాత – శవానికి దగ్గరగా కూర్చుని, ముఖంమీద ఈగలు వాలకుండా తలగుడ్డ తీసి విసురుతున్నాడు (క్రమేపీ ఎండెక్కుతోంది రెం(డ్రోజుల తర్వాత ఆ వూరిమీదపడ్డ మొదటి ఎండ

''ఎడ్మా(టగోరొత్తున్నారు'' అన్నాడు కిళ్లీ బడ్డీ కూర్మావతారం గబుక్కున అందరూ గబగబా లేచి అటు దిక్కు చూసారు దూరంగా పంచె పైకెగ్గట్టి హెడ్మాష్టరు, వెనగ్గా ఆ వూరినుంచే వచ్చే మరి ఇద్దరు మాష్టర్లు గబగబా వస్తున్నారు

''ఎవర(టా – ఎవరూ గుర్తుపట్టలేదా ఇంకా ?'' వస్తూనే గాభరాగా అడిగారు హెడ్మాష్టరు

''అయ్ బాబప్పుడే తవఁ వూరుదాకా వచ్చేసిందేటండీ ఈ ఇసయం ?''

''చెరువు దగ్గర సూరబ్బాయి కనిపించి చెప్పాడు ఇంతకీ ఏ వూరువాట్ట ? ఎవ్వరూ గుర్తుపట్టలేదా ?'' అంటూ శవం దగ్గరగా నడిచి, స్థాణువై నిలబడిపోయారు ఆ మూర్తిని చూస్తూ

''ఎవ్వరూ గుర్తుపట్టలేదండీ ఇలా మట్టిలోనే పడుంది శవం '' అన్నదొక ఆడమనిషి కళ్లు ఒత్తుకుంటూ

''వీరభ(దుడుగారికి చెప్పారా ఎవరన్నా ?''

''సెప్పావండి మరోగంటసేపు చూసి, ఎవ్వరూ గుర్తుపట్టకపోతే ఎవడోడిసేత ఈడ్పించేద్దాంలే అన్నారు'' మారిగాడు తాత

అందరి గుండెల్లోనూ కలుక్కుమంది

కాని ఎవ్వరూ బయటకు తేలలేదు

ఎవ్వరికీ ఏంచెయ్యడానికీ పాలుపోవడంలేదు

''చూడ్డానికి సామాన్యుడిలా లేడు ఎవరో మహానుభావుడిలాగే వున్నాడు ఇక్కడ అర్ధాంతరంగా కన్నుమూసాడు పాపం'' – హెడ్మాష్టారు అన్నారు

''బేంకి మేనేజరుగారొత్తున్నారు'' అన్నాడొక కుర్రాడు హుషారుగా అన్ని తలలూ అటు తిరిగాయి మేనేజరుగారు స్కూటరు మీదొచ్చి అందరి మధ్య ఆగారు ఆ వూరికి ఒక్కటే బ్యాంకు, ఆయనొక్కడే మానేజరు, ఊరికంతకీ అదొక్కటే స్కూటరు

తోసుకుని తోసుకుని ముందుకొచ్చి విషయం చెప్పారు ఆయనకి

స్కూటరు స్టాండేసి, శవం దగ్గరకు నడుస్తూ, హెడ్మాష్టరు పెట్టిన నమస్కారాన్ని యధాలాపంగా అందుకుని, శవాన్ని పరీక్షగా చూస్తూ, ''ఈయనా ఈయన్నెక్కడో చూసానండి'' అంటూ తలపంకించి, ''పట్నంలోనా. ఉఁహుఁకాదు. మ(దాసులో మరే మ(దాసులోనే అక్కడ నేను క్యాషియర్‌గా పనిచేస్తున్నప్పుడీయన మా కష్టమరని నా అనుమానం'' అంటూ హెడ్మాష్టారివైపు తిరిగి, ''దిస్ ఫేస్ ఈజ వెరీ ఫెమీలియర్ వన్ టు మి మేష్టారూ'' అన్నాడు

''నిజమే – ఎందుకో నాకూ చూసినట్లుగానే అనిపిస్తోంది సార్ కాని నేనెప్పుడూ ఈ జిల్లాదాటి వెళ్లలేదుగనే మీరు మ(దాసం టు. న్నా .రూ ? ఊఁ...?'' అంటూ మూతి చుట్టూ కండువా తిప్పుకుని ఆలోచనలో పడి, చటుక్కున ఏదో మెరుపు మెరిసినట్లు అయి, గబుక్కున శవం దగ్గరగా కూర్చుని, చేతినుంచి సంచీ వేరుచేసి, అందులోని సరుకుని బయటకు తీసారు

అందరూ ఉత్కంఠతతో కళ్లార్పకుండా అటే చూస్తున్నారు

ఒక పంచె, లాల్చీ, తువ్వాలు, ప్లాస్టిక్ కాగితంలో చుట్టిన కొన్ని కాగితాలు బయట కొచ్చాయి బట్టలు (ప్రక్కకుపెట్టి, ప్లాస్టిక్ కాగితం విప్పి, పుస్తకాల్ని పొందిగ్గా పట్టుకుని, సంచీలోకి చూసారు. ఇంకేమీ లేవు మేనేజరు గారుకూడా గొంతుక్కూర్చుని ఆ(త్రంగా చూస్తున్నారు పుస్తకాల్లో కొన్ని అచ్చయినవి, కొన్ని (వ్రాత (ప్రతులు. పుస్తకంమీద పేరు చదువుతూనే కళ్లెగరేసి, అన్ని అచ్చుపుస్తకాల మీద అదే రచయిత పేరుండడం గమనించి, గబుక్కున శవం ముఖంలోకి పరికించి చూసి, ''అయ్యబాబోయ్, ఈయన సామాన్యుడు కాడండోయ్'' అని గావుకేక పెట్టారు హెడ్మాష్టరు అందరికీ ఆత్రుత మరీ ఎక్కువ అయ్యింది ''ఈయన 'కృత్తిక' అండీ'' అనరిచారు మళ్లీ

అందరి నొసళ్లలోను (భుకుటి ముళ్లు పడ్డాయి ''అంటె ?!'' అన్నారు కొందరు ''మీకు తెలుసా ?'' అని కొందరు, ''ఎవరో తొందరగా చెప్పండి'' అని మరి కొందరు

''ఈయన మహాకవి అండి మా టెన్త్ క్లాస్ కుర్రాళ్లకు ఈయన పద్యాలున్నాయి కూడా ''

''ఎవరూ మహాకవి కృత్తిక అంటారా ? '' అన్నారు ఒక మాష్టారు ముందుకొస్తూ

''నిస్సందేహంగా ఇదుగో చూడండీ పుస్తకాలు, మి(త్రుల కివ్వడానికి దగ్గర పెట్టుకున్నారు. అయ్యయ్యయ్యో చ్చచ్ఛ ఎంత ఖర్మ కాలిపోయిందీ ఏం మేనేజరు గారూ మ(దాసులో చూసిన జ్ఞాపకం అన్నారుగా – గుర్తుకు రావటంలేదూ ?''

మేనేజరుగారి కళ్లు మెరిసాయి ''చెప్పాగా ఇందాకే—బాగా పరిచయమున్న ముఖమని.''

''ఈయన కృత్తికే అంటారా ? ''

''ఇంకా సందేహమా ? మ(దాసులో మా బ్యాంకి కష్టమరీయన ఈయనకోసం దాచి అన్నీ (క్రొత్త నోట్లిస్తూ వుండేవాడిని. చటుక్కున గుర్తు రాలేదు కాని ఆ మూర్తి మా(త్రం మనస్సులో వుండిపోయింది సినిమా

కవిగా ఈయనకు తిరుగులేదు నిర్మాతలు సంవత్సరాల తరబడి ఈయనింటి చుట్టూ తిరుగుతూంటారు'' అన్నారు మేనేజరుగారు — ముందస్తుగా తాను గుర్తుపట్టలేక పోయినందుకు తెగ బాధపడిపోతూ

''సినిమాల్లోనే ఏవిటండీ— యావదాంధ్ర దేశంలో ఈయన కసలు పోటీ వుందా ? ఏం కవిత్వం ఏంకవిత్వం. ఇలా అర్థాంతరంగా ఖర్మ కాలి ఈ మారుమూల దిక్కుమాలిన పల్లెటూళ్లో జీవితయాత్ర ముగించాడు కాని, ఇదే మద్రాసో హైద్రాబాదో అవుతే తెలుగువాడైన ప్రతివాడూ గుండెలవిసేలా రోదిస్తూ ఈయనగారి అంతిమయాత్రలో పాల్గొనేవారు కదండీ ?''

''మరే మరే అంత భారీఎత్తున మనం ఎలాగూ ఏమీ చెయ్యలేంకాని, శాస్త్రోక్తంగా దహనక్రియలు జరిపించి, హృదయ పూర్వకంగా నివాళులర్పిద్దాం వీరభద్రుడుగారి దగ్గరకు వెళ్దాం పదండి''

* * *

విషయం వింటూనే వీరభద్రుడుగారు విస్మయంగా చూసారు వాళ్ల ముఖాల్లోకి. ''కృత్తిక అనే పేరు పేపర్లలోనూ పత్రికల్లోనూ, కనబడుతూనే వుంటుంది ఆయన గురించి చాలా మంది చెప్పగా గొప్ప కవి అని నేనూ విన్నాను అయితే అంత గొప్పవాడు కేవలం చావడానికా అన్నట్లు మన వూరెందుకొస్తాడు ? ఒక్కళ్లకీ ఆయన బంధువుగాని, మిత్రుడుగానీ కాడే ?!! ఈ శవం, కృత్తిక ఒకరు కారని నా నమ్మకం'' అన్నారు ముఖం అడ్డంగా తిప్పుతూ

''లేదండీ. నేను పట్నంలో పని చేస్తున్న రోజుల్లో ఓసారాయనని మా స్కూలు వార్షికోత్సవాలకు ఆహ్వానించారు. ఇంకా ఒకటి రెండు సార్లు వేదికల మీద కూడా చూసాను'' అన్నారు హెడ్మాష్టారు నమ్మకంగా.

''అంతెందుకు నాకు బాగా పరిచయమున్న వాడని చెబాతున్నానుగా. మద్రాసులో నాకు పరిచయముండేది అయితే ఇప్పుడు నన్ను వెతుక్కుంటూ ఈ వూరొచ్చేంత పరిచయం కాదనుకోండి. ఆ రోజుల్లో నేనుకూడా కవిత్వం వ్రాసి చూపిస్తే చాలా బావుందని మెచ్చు'' అంటూ మేనేజరుగారింకా చెప్పతూండగానే, మధ్యలో అందుకుని, ''మరయితే ఈయన మన వూరు ఎందుకొచ్చేడనేదానికి జవాబేమిటి ?'' అన్నాడు వీరభద్రుడుగారు.

ఒక్కరూ జవాబు చెప్పలేక పోయారు
మౌనముద్ర వహించారు.

''ఏది ఏమయినా మీరిద్దరూ గుర్తుపడుతున్నారు కాబట్టి, ఆయన వద్దవున్న ఆధారాలని బట్టే నేనూ ఆయన కృత్తిక అనే నమ్ముతున్నాను''



# కీర్తి - నీకు జోహార్లు

—అందరి ముఖాలూ వికసించాయి

''కానయితే ఇప్పుడేవిటి చెయ్యడం ? రోడ్లు బాగులేవు కనీసం ఫోనుకూడా పని చెయ్యడం లేదు అంతటి మహానుభావుణ్ణి గుట్టుచప్పుడు కాకుండా ఈ మారుమూల మనం దహనం చేసేస్తే ప్రపంచం హర్షిస్తుందా ? రేప్పొద్దున్న మనమీదకు దండెత్తి రారూ ?'' తన సందేహాన్ని వాళ్లముందుంచారు వీరభద్రుడుగారు.

రెట్టింపయిన వుత్సాహంతో ముందుకొచ్చి అన్నారు హెడ్మాష్టారు, ''అయ్యా, మీకు ఆ సందేహం ఏ మాత్రం అక్కరలేదు ఆయన ఈ వూరెందుకు వచ్చాడూ ఏమిటీ అనేవి మరి కొన్ని రోజుల్లో మనకెలాగూ తెలుస్తాయి. పోతే ఆయన మరణంలో ఏమీ కుట్రలేదు; శ్రమకి ఓర్చలేక వృద్ధుడయిన కారణంగా ఆయన మరణించాడు ఏమండీ—ఇటువంటి పరిస్థితుల్లో బంధువులకిగాని, పోలీసువారికిగాని శవాన్ని

ఆంధ్ర పత్రిక
దిన పత్రికలో
* మన సినిమాలు
* వింత యదార్థం
శీర్షికలు
చూస్తున్నారా ?

అప్పగించే అవకాశం ఏకోశానా లేదు కాబట్టి, మీవంటి పెద్దలు పూనుకుని ఒక కారణ జన్ముడైన మహాకవికి స్వయంగా దహన సంస్కారం జరిపించారని తెలిస్తే లోకం మీ కీర్తిని శ్లాఘిస్తుందిగాని, ఎన్నటికీ గర్హించదు కాబట్టి నిస్సంకోచంగా తమరు కార్యం నిర్వహించడం వుత్తమం''

''అంతేనండి'' అన్నారు మేనేజరుగారు

తల పంకించి ఆలోచనలో పడ్డారు వీరభద్రుడుగారు. ఇందులో తనకు కొంప మునిగేదేముంది ఒక అనాథ ప్రేతానికి జరిపే దహన సత్కారమంతే. అయితే మహాకవి కాబట్టి కొంచెం శాస్త్రోక్తంగా జరిపించితే, రేప్పొద్దున్న తనని జనం వేనోళ్ల పొగడుతారు పత్రికల్లోనూ, రేడియోలోనూ తన పేరు మారుమోగుతుంది. ఇతర్త్రా ఆ వూరు దాటి తన పేరు పాకడానికి ఎలాగూ అవకాశం లేదు. ఇదే బంగారు అవకాశం, తన అదృష్టంకొద్దీ ఆ కవిగారు ఈ వూళ్లో ఆఖరి శ్వాస వదిలాడు.

* * *

ఊళ్లో నలుగురు పెద్దలూ కలిసి శవాన్ని అతిజాగర్తగా మోసుకొచ్చి, వీరభద్రుడిగారి చావడిలోకి చేర్చారు దహన సంస్కారానికి సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి వీరభద్రుడుగారు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు స్కూలుకి శలవిచ్చేశారు దక్షిణపు దిక్కుగా ఉన్న వూళ్లనుంచి ఇక్కడ స్కూల్లో చదువుకోవడానికి వచ్చేపిల్లలు, వూరి జనం అంతా కోలాహలంగా వుంది బ్రాహ్మణాగ్రహార శాస్త్రిగారి కోసం కబురు వెళ్లింది—కర్మకాండ జరిపించడానికి

బ్యాంకు తెరచి సీట్లో కూర్చున్న మేనేజరుగారికి ముళ్లమీద కూర్చున్నట్లుంది. ఒకటి — తను ముందస్తుగా కవిగార్ని గుర్తుపట్టలేకపోయాడు రెండు — ఇంత తతంగం జరుగుతూన్నా తను బ్యాంకు తెరవక తప్పదు. తల పట్టుకుని కూర్చున్న ఆయనకి చటుక్కున ఓ ఆలోచన వచ్చింది ఒక్కసారిగా లేచి నిలబడి, క్యాషియర్తో, ''ఇదుగో మూర్తీ ఈ రోజు ట్రాన్స్‌క్షన్సేమీ వుండవు అంతగా ఒకటీ అరా వున్నా నువ్వు మేనేజ్ చెయ్యి'' అని చెప్పి, స్కూటర్ స్టార్టుచేసి దక్షిణపు దిక్కుగా వురికించాడు

పడుతూ, లేస్తూ, ఎలాగయితేనేం ప్రక్క వూరుచేరి శర్మగారింటి ముందు ఆగింది స్కూటరు గబగబా మెట్లెక్కి తలుపు తట్టారు తలుపులు తెరచుకున్నాయి ''శర్మ గారున్నారామ్మా ?''

''ఉన్నారు కూర్చోండి''

''కూర్చునే టైంలేదు—త్వరగాపిలవండి''

శర్మగారి భార్య లోపలకు పరుగెత్తి, భర్తను పిలుచుకొచ్చింది ''ఏమిటండీ ఏమయ్యిందీ ?''

''ఇప్పుడేమీ చెప్పే టైములేదు. మీరు చొక్కా తగిలించుకుని, నాతో బయల్దేరాలి.''

ఇద్దరితోనూ ముందుకు వురికింది స్కూటరు

''ఏమిటి మేనేజరుగారూ—ఏం జరిగిందీ ?''

''ఘోరం జరిగిపోయింది''

ముచ్చెమటలు పోసాయి శర్మగారికి. ''ఏం జరిగిందో చెప్పండి బాబూ'' గుండెలదురుతుండగా అడిగారు

''మద్రాసునుంచి మీ కోసం వచ్చిన కృత్తిక గారు మా వూర్లో మరణించారు.''

ఉలిక్కిపడి, ఆశ్చర్యంగా అన్నారు శర్మగారు, ''కృత్తిక అంటే మీరనేది కవిగారి గురించా ?''

''ఆహా ఆయనే''

''ఏవిటి మీరు మాట్లాడేది — కృత్తిక గారేమిటి. నాకోసం రావడం ఏమిటి మీ వూళ్లో మరణించడం ఏమిటీ ?!!!''

''చూస్తారుగా..'' అతికష్టంగా నడుస్తోంది స్కూటరు బురదగానూ, ఎగుడు దిగుడుగానూ వున్న బాటలోంచి.

శర్మగారి మెదడు ఆలోచనలతో వేడెక్కుతోంది తనూ కవిత్వాలు వ్రాస్తాడు కాబట్టి, కొద్దోగొప్పో పేరున్నవాడు కాబట్టి, కృత్తిక గారితో కొద్దిగా పరిచయం వున్న మాట నిజమే. అయితే మాత్రం—ఆయన తనని వెతుక్కుంటూ, వానల్లో, వరదల్లో !!

"మా యథాశక్తి మేం మహాకవికి దహన సంస్కారం జరిపించి, నివాళులర్పిస్తున్నాం రేపు ప్రపంచానికి ఈ విషయాన్ని చాటవలసిన వాళ్ళు మీరే" వీరభద్రుడిగారి ఇల్లు చేరుతూండగా అన్నారు మేనేజరుగారు

శర్మగారేమీ మాట్లాడలేదు.

స్కూటరు కొంచెం దూరంగా ఆపి, ఇంట్లోకి బయల్దేరారిద్దరూ

అప్పుడే అగ్రహారం నుంచి శాస్త్రిగారూ, మరికొందరు బ్రాహ్మలూ వచ్చారు వీరభద్రుడి గారి ఆధ్వర్యంలో జరుగుతూన్న ఖర్మకాండని తాము జరిపించబోతున్నందుకు, తమకు ముట్టబోయే సంభావనలను తలుచుకుంటూ ఆనందంతో వుబ్బితబ్బిబ్బవుతున్నారు వాళ్ళు

"ఈరోజు వూరందరికీ భోజనాల్ట" అంటున్నాడొక కుర్రాడు సంతోషంతో ఎగిరి గంతేస్తూ

జనాన్ని అదుపు చేయడమే కష్టంగా వుంది

పెళ్ళి జరుగుతున్నంత సందడిగా వుంది

వీరభద్రుడుగారి ఆధ్వర్యంలో మంచి కార్యమైనా, అశుభ కార్యమైనా అంత హడావుడీ మామూలే.

పిచపిచలాడుతూన్న గుండెతో శర్మగారూ, ఉరకలేస్తూన్న గుండెతో శాస్త్రిగారూ గబగబా శవం దగ్గరకు చేరి, శవం ముఖంలోకి చూసి, నిశ్చేష్టులై, శిలాప్రతిమల్లా నిలబడిపోయారు—

"కృత్తికే కదూ — దారుణం జరిగిపోయింది శర్మగారూ" అన్నారు మేనేజరుగారు శర్మగారి కొక్కరికే వినిపించేలాగ.

శర్మగారు జవాబివ్వలేదు

మేనేజరుగారికి కంగారు పుట్టింది గబగబా ఇటూ అటూ చూసారు వీరభద్రుడుగారు ఏమిటన్నట్లు చూస్తూ తలాడించారు.

"ఏమిటి శర్మగారూ — కొంపతీసి ఇతగాడు కృత్తిక కాదా ఏమిటీ?" గాభరాగా గొణిగారు మేనేజరుగారు. కృత్తికే కనక కాకపోతే వీరభద్రుడుగారు తనని, హెడ్మాష్టర్ని ఊరు మధ్యగా వుప్పు పాతర వేయించేస్తారు

"ఏమిటేంటో ఇద్దరూ సందేహిస్తున్నట్లుగా వున్నారు" అంటూ అక్కడి కొచ్చారు వీరభద్రుడు గారు

గద్గదికతో అన్నారు శర్మగారు — "ఏమీ లేదండి. పది సంవత్సరాల పరిచయం ఈనాటితో బూడిదపాలయి పోతోంది కదాని" అంటూ దుఃఖానికి లొంగిపోయి, చేతుల్లో ముఖం దాచుకున్నారు.

'హమ్మయ్య' అని వూపిరి పీల్చుకున్నారు మేనేజరుగారు

"ఎన్నో సార్లు వారిని మా యింటికి ఆహ్వానించాను అలాగేలే అంటూ దాటించేసేవారు నేను తీసుకువెళ్తాను రండి అంటే మాట తప్పించేసేవారు. ఇలా ఒంటరిగా బయల్దేరి .. ఈ నిర్భాగ్యుడికోసం " దుఃఖం ఆగింది కాదు

ఓదార్పుగా ఆయన భుజం తట్టి, "ఏది ఏమయినా మీ కారణంగా ఓ మహానుభావుడికి మా చేతుల మీదుగా అంతిమయాత్ర ఏర్పాటు చేసే భాగ్యం మాకు దక్కింది మా శక్తికి తగ్గట్లు ఏ లోటూ రానియ్యడంలేదు. ఈ విషయాన్ని ప్రపంచానికి మీరెలా చాటుతారో" అంటూ, కుడిప్రక్కకు తిరిగిన వీరభద్రుడుగారు ఆశ్చర్యంతో, "ఏమిటిశాస్త్రిగారూ ఏమయ్యిందీ" అన్నారు

తలపట్టుకుని కూలబడిన శాస్త్రిగారు, "ఏమి లేదయ్యా! ఈ మహానుభావుడెవరో నాకు తెలియదు. కానీ చూడగానే ఎందుకో గుండెల్లో గునపం గుచ్చినట్లయ్యింది ఎంతో ఆత్మీయుణ్ని కోల్పోయినట్లుగా అనిపించింది ఈ ఖర్మకాండ నేను నిర్వహించలేను" అన్నారు బాధగా

"అలా అంటే కాదు మీరు నిర్వహించక తప్పదు."

"అయితే ఒక్క షరతు—మన్నించాలి"

"ఏమిటి ?"

"నేను ఒక్క పైసా కూడా తీసుకోను. స్వచ్ఛందంగా నిర్వహిస్తాను "

"ఊఁ మీ ఇష్టం "

* * *

చితిమంటలు ఎర్రెర్రగా ఆకాశాన్నంటుతూండగా, గంధపుచెక్కల సువాసనలో మిళితమైన నేతి వాసనని ఆఘ్రాణిస్తూ, ఇలా అనుకున్నారు శర్మగారు, 'ఈ స్వార్థపూరిత లోకాన్ని వదిలి వెళ్తూన్న ఓ ఆత్మా! నువ్వెరివో నాకు తెలియదు. నీ దేహాన్ని నేనెప్పుడూ చూడలేదు. కేవలం నీ శరీరం ఒక కవిని పోలి వుండటంతో ఈ మూర్ఖులు అపోహపడి, కీర్తి కండూతితో సకల లాంఛనాలతో నిన్ను సాగనంపుతున్నారు నువ్వెవరివయినప్పటికీ, నీ రూపం నన్ను ముగ్ధుణ్ని చేసింది భక్తితో నమస్కరింపజేసింది నీ శరీరం నక్కలపాలు కాకుండా నేను చేయగల సాయం ఇంతే '

అదే సమయంలో శాస్త్రిగారు కన్నీళ్లతో ఇలా అనుకున్నారు, "నేస్తం, రామాచారీ! నీ ఋణాన్ని ఈ విధంగా తీర్చుకునే అవకాశం కలిపించావా? ఏం పెద్దమనిషివయ్యా? నువ్వు సంసార బంధాలు తెంచుకుని ఏనాడో దేశ సంచారం ప్రారంభించినా, మనం తారసపడ్డ ప్రతీసారీ నా ఇంటికొచ్చి, నా ఆతిథ్యం స్వీకరించి, నా కోరిక తీర్చమని ప్రాధేయపడితే, ఇన్నాళ్లకు ఆఖరి దశలో, నువ్విచ్చిన మాట తప్పకుండా ఈ విధంగా నాకు దర్శనమిచ్చావా? వీళ్లలో కీర్తికండూతే లేకపోతే నిన్నొక మహాకవిగా భావించి ఈ ఏర్పాట్లు చేస్తారా? ఇంత ఘనంగా నిన్ను సాగనంపే శక్తిమంతుణ్నా నేను?! అందుకే అంటున్నాను — నేస్తం, ఆనందంగా పోయిరా అమరలోకాలకి. కీర్తీ — నీకు జోహార్లు!!" ★

